సాక్షి
కుమురం భీం
శుక్రవారం ၊ 30 ၊ మే ၊ 2025



భవితకు భరోసా..! 8లో▸
ఉమ్మడి జిల్లాలోని భవిత కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి. దివ్యాంగ పిల్లలకు భరోసానిచ్చే ఈ కేంద్రాల్లో వసతులు కల్పించనున్నారు.



కాల్చేస్తే కాలుష్యం..
రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది కొయ్యలు కాలుస్తున్నారు. కొయ్యలను అదే చేనులో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. 9లో▸



వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు ఎనిమిది వారాలు గడిచినా డబ్బులు అందలేదన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని, వేసవి భత్యం చెల్లించాలన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కూలీలు రమేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన షావెల్‌కు 'ఆపరేషన్ సిందూర్' పేరు



నూతన షావెల్ ప్రారంభిస్తున్న జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో నూతన షావెల్‌కు సింగరేణి అధికారులు 'ఆపరేషన్ సిందూర్'గా నామకరణం చేశారు. ఈ యంత్రాన్ని గురువారం ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో మెరుగైన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు యంత్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు. యంత్రాల పనితీరును ఎప్పటిప్పుడూ పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారి నరేందర్, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ రామనాథం, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని కేజీబీవీలు, ఎస్ఎస్ఏ యూఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం డీఈవో యాదయ్యకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ జిల్లాలో భార్యాభర్తలుగా ఉన్న ఉపాధ్యాయులు వివిధ మండలాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా ఒకే మండల పరిధిలో డిప్యూటేషన్ అవకాశం కల్పించాలన్నారు. సమగ్ర శిక్షాలో పనిచేసిన వారిని ఏప్రిల్ 24న తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజ్ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సాక్షి ఎఫెక్ట్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రధాన మురుగు నీటి కాలువ కబ్జాకు గురవుతుందని గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆక్రమణలో డ్రెయినేజీ!' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆక్రమణకు గురైన ప్రాంతాలను గురువారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యతోపాటు అధికారులు గురువారం పరిశీలించారు. ఆక్రమణలు తొలగించేందుకు పొక్లెయిన్ సైతం తీసుకెళ్లారు. అయితే అధికారులకు రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఎలాంటి చర్యలు తీసుకోకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అంజయ్యను సంప్రదించగా, కబ్జాలను తొలగించాలని అక్రమదారులను హెచ్చరించామని, తొలగించని పక్షంలో రెండు రోజుల్లో తామే అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని తెలిపారు.

ఉద్యాన పంటలకు ఊతం

- జిల్లాలో 31 హెక్టార్లలో పండ్ల తోటల సాగు లక్ష్యం
- రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై పరికరాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు(ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): రైతులు పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో వర్షాలు, సారవంతమైన భూములు, నాణ్యమైన విత్తనాలు, సకాలంలో సస్యరక్షణ చర్యలు.. ఇలా భూమిలో విత్తనం పడిన నాటి నుంచి పంట చేతికందే వరకు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. అయినా అన్నదాతలకు వ్యవసాయంలో లాభాలు కంటే నష్టాలే అధికంగా మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలోని తేలికపాటి భూముల్లో పండ్ల తోటల సాగుతో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. దీంతో ఉద్యానవన శాఖ అధికారులు జిల్లా రైతులకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తూ జిల్లావ్యాప్తంగా ఉద్యానవన పంటల సాగుకు ఊతం ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.

ప్రత్యేక రాయితీలు, పరికరాలు

పండ్ల తోటల సాగులో నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. కొన్నిరకాల తోటలు వర్షాధారంగానే దిగుబడిని అందిస్తాయి. మిగిలిన తోటల్లోనూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ ఉత్పాదకతను సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. బిందు, తుంపర సేద్యం పరికరాలు రాయితీపై అందిస్తోంది. తెలంగాణ సూక్ష్మ సేద్య పథకం(టీజీఎంఐపీ) పథకం ద్వారా ప్రభుత్వం పండ్ల తోటలు సాగుచేసే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీ చిన్న సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీ, ఓసీ, ఇతర వర్గాలకు చెందినవారికి 80శాతం సబ్సిడీపై బిందుసేద్యం పరికరాలు అందిస్తున్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో వంద ఎకరాల్లో ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం 170 తుంపర సేద్యం పరికరాలను అందించాలని లక్ష్యం నిర్దేశించింది. అయితే తుంపర సేంద్యం పరికరాలను అన్నివర్గాల రైతులకు 75 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో తోటలకు నీటికి అందించేందుకు రైతులకు ఇవి ఉపయోగకరంగా మారనున్నాయి. అలాగే వారిపై ఆర్థికభారం సైతం తగ్గనుంది.

2025- 26లో సాగు లక్ష్యం (హెక్టార్లలో)

డ్రాగన్ ఫ్రూట్	2
బొప్పాయి	5
పనస	6
మామిడి	10
జామ	5
బత్తాయి	3
ప్లాస్టిక్ మల్చింగ్	40

తీగజాతి కూరగాయల సాగుకు..

పండ్ల తోటలపాటు కూరగాయల సాగులోనూ రైతులకు మంచి లాభాలు ఉంటాయి. కూరగాయల సాగుకు నీటి వనరులు ఎంతో ముఖ్యం. అందుబాటులో నీటి సౌకర్యం ఉన్న రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించేందుకు శాశ్వత పందిర్లను ప్రభుత్వం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 20 యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం జిల్లా ఉద్యానవన శాఖ అధికారులకు లక్ష్యం నిర్ణయించింది. అరెకరంలో శాశ్వత పందిరి నిర్మాణాన్ని ఒక యూనిట్‌గా అధికారులు నిర్ధారిస్తారు. తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సోర, పొట్ల వంటి వాటిని శాశ్వత పందిర్ల సహాయంతో సాగు చేస్తే.. సాధారణ పద్ధతి కంటే ఎక్కువ దిగుబడి సాధించేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే జాతీయ

యాంత్రీకరణ ఇలా..

పరికరం	మంజూరైన యూనిట్లు
పవర్ టిల్లర్	6
పవర్ వీడర్	6
బ్రష్ కట్టర్	16
క్నాప్సాక్ స్ప్రేయర్	6

జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు (ఎకరాల్లో)

వివిధ రకాల పండ్ల తోటలు	1311.84
కూరగాయలు	8,097.58
సుగంధ ద్రవ్యాలు	180.18
ఆయిల్‌పామ్	1,334.68
ప్లాంటేషన్ పంటలు	246
పూల తోటలు	6.07
ఆగ్రో ఫారెస్ట్రీ	360.21
బార్డర్ ప్లాంటేషన్	11

వెదురు మిషన్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 80 ఎకరాల్లో వెదురు తోటలు ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు.

31 హెక్టార్లలో పండ్ల తోటలు

ఈ ఆర్థిక సంవత్సరంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం, నేషనల్ మిషన్ ఆన్ ఎడెబుల్ ఆయిల్ పామ్ పథకాల ద్వారా జిల్లాలో 31 హెక్టార్లలో వివిధ రకాల తోటల పెంపకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. కొత్త తోటల ఏర్పాటు ద్వారా జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. తోటల పెంపకంతో కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నారు. తోట ఏర్పాటు చేసుకున్న సంవత్సరం నుంచి మూడేళ్ల వరకు రాయితీని తోటల సంరక్షణ కోసం ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోనే జమచేస్తోంది. ఇక ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతుకు ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తుంది. అందులో రూ.2,100 పంట సంరక్షణకు, మిగిలిన రూ.2,100 అంతర పంటల సాగు కోసం వినియోగించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తేలికపాటి భూముల్లోనూ పండ్ల తోటలు ఏర్పాటు చేసుకుని లాభాలు సాధించవచ్చు. ఒక్కసారి తోట ఏర్పాటు చేస్తే దీర్ఘకాలికంగా ఫలాలు పొందే అవకాశం ఉంది. రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందిస్తోంది.

– ఎంఏ నదీం, ఉద్యానవన శాఖ అధికారి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ధాన్యంలో తేమశాతం పరీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని ఎడవెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సందర్శించారు. కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తేమశాతాన్ని స్వయంగా పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా రైతుల అవసరం మేరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తేమ శాతం తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, కేటాయించిన ప్రకారం రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని సూచించారు. రైతులు ఆందోళనకు గురికావొద్దని, కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ధాన్యంలో తప్ప, తాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావు, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఏపీఎం వెంకటరమణ శర్మ, రైతులు పాల్గొన్నారు.

యువ వికాసం ద్వారా ఉపాధి అవకాశాలు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50వేల నుంచి రూ.లక్షల వరకు గల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేసి జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

'భూభారతి'లో సమస్యల వెల్లువ!



ఎల్కపల్లిలో భూభారతి దరఖాస్తుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే(ఫైల్)

- పైలట్ మండలం పెంచికల్‌పేట్‌లో 399 అర్జీలు
- తొమ్మిది అంశాలపై అత్యధిక దరఖాస్తులు
- 227 దరఖాస్తులకు పరిష్కారం.. పెండింగ్‌లో 172

సాక్షి, ఆసిఫాబాద్: ధరణి స్థానంలో రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకం అమలులో భాగంగా జిల్లాకు ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఆ మండలంలో సదస్సులు నిర్వహించిన అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెంచికల్‌పేట్ మండలాన్ని 'పైలట్'గా ఎంచుకున్నారు. ఈ 15 గ్రామాల నుంచి 399 దరఖాస్తులు రాగా.. అందులో 227 దరఖాస్తులను పరిష్కరించిన అధికారులు.. మరో 172 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు.

ఈ నెల 19 వరకు సదస్సులు నిర్వహణ

పెంచికల్‌పేట్ మండలంలో ఈ నెల 5 నుంచి 19 వరకు భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులు ఏర్పాటు చేశారు. ఇందులో అధికారులకు వందల సంఖ్యలో అర్జీలు వచ్చాయి. చేడ్వాయి, కొండపల్లి, లోడ్‌పల్లి, ఎల్కపల్లి, బొంబాయిగూడ, గుంట్లపేట, జన్కాపూర్, పోతేపల్లి, ఎల్లూర్, ఆగర్‌గూడ, కమ్మర్‌గాం, కోయచిచ్చాల, మురళీగూడ, పెంచికల్‌పేట్, తేలపల్లి గ్రామాల నుంచి మొత్తం 399 దరఖాస్తులు స్వీకరించినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రధానంగా అర్జీదారులు అసైన్డ్(పీవోటీ), సాదాబైనామా, వారసత్వ మార్పిడి గురించి ఎక్కువగా అడిగారు. అదేవిధంగా భూ హద్దుల సమస్యలు, పేర్లు సరిచేయడం, భూ విస్తీర్ణంలో తేడాలు, భూములు నిషేధిత జాబితాలోకి ఎక్కడం, సర్వే నంబర్ల మిస్సింగ్ తదితర సమస్యల పరిష్కారం కోసం అధికారులకు విన్నవించారు.

అర్జీల వివరాలు

అంశాలు	అర్జీలు
అసైన్డ్(పీఓటీ)	92
సాదాబైనామా	37
డీఎస్ పెండింగ్	102
మిస్సింగ్ సర్వేనంబర్లు	76
వారసత్వ మార్పిడి	11
ఇతర దరఖాస్తులు	81

మూడు ప్రత్యేక బృందాలు...

పెంచికల్‌పేట్ మండంలోని 15 గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను మొదట అధికారులు భూభారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందులో 383 దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో డిజిటలైజేషన్ చేయగా.. మిగిలిన 16 దరఖాస్తులను డిజిటలైజేషన్ పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ముగ్గురు తహసీల్దార్ల నేతృత్వంలోని సిబ్బంది దరఖాస్తుదారులకు నోటీసులు అందజేసి వారి సమక్షంలోనే సమస్య పరిష్కరిస్తున్నారు. మొత్తం 399 అర్జీల్లో అసైన్డ్ 92, సాదాబైనామా 37, మిస్సింగ్ సర్వే నంబర్లు 76, డీఎస్ పెండింగ్ 102, వారసత్వ మార్పిడి కోసం 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సాదాబైనామా, అసైన్డ్ దరఖాస్తులను పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచారు.

నీటి గుంతలు.. గుండెకోతలు





కౌటాల- బెజ్జూర్ ప్రధాన రహదారి సమీపంలో ప్రమాదకరంగా నీటికుంట

కౌటాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బోయర్ లక్ష్మి(13), మహారాష్ట్రలోని ఎటపల్లికి చెందిన సిండే హన్సిక(11) ఈ నెల 23న వ్యవసాయ చేనుల్లోకి బహిర్భూమికి వెళ్లారు. అక్కడి నుంచి ఆడుకుంటూ చెరువు కుంటలో తవ్విన లోతైన గుంత వద్దకు చేరుకున్నారు. నీళ్లలో కనిపించిన ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు లక్ష్మి గుంతలో పడిపోయింది. ఆమెను రక్షించేందుకు హన్సిక చెయ్యి పట్టుకోగా.. ఇద్దరూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన పిప్పిరి హేమంత్(16) ఈ నెల 24న సమీపంలోని పెద్దవాగులో స్నానం చేసేందుకు వెళ్లాడు. వాగులో మునిగి మృతి చెందగా, ఆ తర్వాతి రోజు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు.

గతేదాది ఫిబ్రవరి 11న చింతలమానెపల్లి మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు యువకులు తుమిడే హరీశ్, కంబాల మహేశ్ ప్రాణాలు కోల్పోయారు. యువకులిద్దరూ బైక్‌పై శుభకార్యానికి వెళ్లి మార్గమధ్యలో సేదతీరేందుకు చేను వద్ద ఆగారు. వ్యవసాయ బావికి రక్షణ గోడ లేకపోవడంతో రాత్రిపూట బావిని గుర్తించక అందులోపడి మృతి చెందారు.

- ప్రాణాలు తీస్తున్న చెరువులు, జలాశయాలు
- ప్రమాదకరంగా వ్యవసాయ బావులు
- రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు
- ఇటీవల కౌటాలలో ఇద్దరు చిన్నారులు మృతి

కౌటాల(సిర్పూర్): ఊరికి ఉపకారం చేసే చెరువులు, జలాశయాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సరదాగా నీటి వనరుల వద్దకు వెళ్లిన వారు వివిధ కారణాలతో వాటిల్లోకి దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు, ఇళ్ల నిర్మాణాల కోసం కాంట్రాక్టర్లు, చెరువులు, కుంటల వద్ద మట్టి కోసం తవ్వడంతో ప్రమాదకరమైన గుంతలు ఏర్పడుతున్నాయి. నీటి లోతు తెలియక అందులో దిగినవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు గుండె కోత మిగులుస్తున్నారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో నిండుగా ఉండే చెరువులు, బావులు, కుంటల వద్ద రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇటీవల కౌటాల మండలం తాటిపల్లి గ్రామంలో నీటి గుంతలో పడి ఇద్దరు బాలికలు మృతి చెందారు. నీటికుంట చుట్టూ రక్షణ లేకపోవడంతో బాలికలు జారి పడినట్లు తెలుస్తోంది.

కనిపించని హెచ్చరిక బోర్డులు

జిల్లాలోని ప్రధాన రహదారుల సమీపంలో వ్యవసాయ బావులతోపాటు లోతైన నీటి కుంటలు ఉన్నాయి. అక్కడ సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జనసంచారం ఎక్కువగా ఉండే చాలాప్రాంతాల్లో రోడ్డు పక్కన వ్యవసాయ బావులున్నా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ప్రమాదకరంగా ఉన్న బావులు, మూలమలుపులు, కల్వర్టులు కూలిన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇష్టారీతిన తవ్వకాలు..

చెరువులు, కుంటల్లో మొరం, మట్టి కోసం ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతున్నారు. ఈ గుంతలు చేపల వేటకు వెళ్లిన వారిని, సరదాగా ఈత కోసం వెళ్లే చిన్నారులను బలి తీసుకుంటున్నాయి. చెరువులు, కుంటలను ఇరిగేషన్ శాఖ పర్యవేక్షిస్తోంది. మొరం తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ శాఖ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయాలి. మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఫీజు చెల్లిస్తే పర్మిషన్ ఇస్తారు. ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా చెరువులు, కుంటల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి.

రక్షణ చర్యలు చేపడతాం



వేసవిలో పిల్లలు గంటల తరబడి నీళ్ల చెంతనే ఆడుతుంటారు. తోటి వారిని అనుకరిస్తూ ఈత రాకున్నా నీళ్లలోకి దిగుతూ ప్రమాదాల బారిన పడుతుంటారు. వారిపై తల్లిదండ్రులు నిత్యం పర్యవేక్షణ ఉంచాలి. ఇంటి నుంచి బయటకు వెళ్తే తప్పకుండా సమాచారం తెలుసుకోవాలి. పంచాయతీ అధికారులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న గుంతలను గుర్తించి రక్షణ చర్యలు చేపడతాం.

– రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్

కిశోర బాలికలకు 'ఇందిరమ్మ అమృతం'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కిశోర బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ అమృతం పథకం అమలు చేస్తుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ తెలిపారు. జిల్లాలోని 973 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 14 నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న 18,230 మంది కిశోర బాలికలకు ఇందిరమ్మ అమృతం పథకం ద్వారా పల్లీలు, చిరుధాన్యాలతో తయారు చేసిన చిక్కీలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రోజుకు ఒకటి చొప్పున నెల రోజులకు 30 చిక్కీలు ఇస్తారని, ప్రతీ 15 రోజులకు వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క చిక్కీలో సుమారు 600 క్యాలరీలు, 18- 20 గ్రాముల ప్రోటీన్లతోపాటు అవసరమైన సూక్ష్మ పోషకాలు ఉంటాయన్నారు.

రోస్టర్ ప్రకారమే ఉద్యోగులకు పదోన్నతులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ రోస్టర్ ప్రకారమే చేపడుతున్నామని జీఎం విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్ కార్పొరేట్ కమిటీ సభ్యులు గురువారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియా జీఎం కమిటీ సభ్యులకు గోలేటిలోని జీఎం కార్యాలయంలో స్వాగతం పలికి మొక్క అందించారు. అనంతరం ఏరియాలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల రోస్టర్‌ను కార్పొరేట్ చీఫ్ లైసెన్ అధికారి దుర్గం రాంచందర్ తనిఖీ చేశారు. ఖాళీల భర్తీ, పదో న్నతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, కమిటీ సభ్యులు రాజేశ్వర్, వెంకటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, కె.తిరుపతి, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమం సంఘం ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



చీఫ్ లైసెన్ అధికారికి మొక్క ఇస్తున్న జీఎం

క్లుప్తంగా

పాముకాటుతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

కెరమెరి: మండలంలోని శివగూడలో టేకం గుండయ్యకు చెందిన ఎద్దును గురువారం పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఉదయం మేతకోసం వెళ్లిన ఎద్దు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో గుండయ్య మేత మేస్తున్న ప్రదేశానికి వెళ్లిచూడగా మృతి చెంది కనిపించింది. ఎద్దు కాలుకు రెండు పాము కాట్లు కనిపించాయన్నాడు. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గుండయ్య కోరుతున్నాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



దత్తు (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్నం బ్రిడ్జి వద్ద మంగళవారం వరద నీటిలో గల్లంతైన దత్తు మృతదేహం గురువారం పూసాయి గ్రామ సమీపంలో లభ్యమైనట్లు జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భూమి కాజేసిన ఒకరిపై కేసు

తలమడుగు: నకిలీ పత్రాలు సృష్టించి 25 ఎకరాల భూమిని కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెలండించారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల శివారు 246 సర్వేనంబర్‌లో ఉన్న 25 ఎకరాల భూమిని 50 ఏళ్ల క్రితం దేవాపూర్ గ్రామానికి చెందిన అమీరొద్దీన్‌కు ప్రభుత్వం అప్పగించింది. అట్టి భూమిని తలమడుగు మండల కేంద్రానికి చెందిన క్లోం కరుణాకర్‌రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి అమీరొద్దీన్ వారసుడిగా లతీఫొద్దీన్ పేరు మీద పట్టా చేయించాడు. ఆతర్వాత కరుణాకర్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు క్లోం కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ తెలిపారు.

గంజాయి సేవించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి సేవించిన బంగారుగూడకు చెందిన ఫేరోజ్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పొచ్చర సర్వీస్ రోడ్డు ప్రాంతంలో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా విచారించి పరీక్షలు నిర్వహించగా పాజిటీవ్ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. దీంతో ఫెరోజ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుక్కల దాడిలో నీలుగాయికి గాయాలు



గాయపడిన నీలుగాయి

బోథ్: మండలంలోని కంటెగాం గ్రామ సమీపంలోని అడవిలో బుధవారం సాయంత్రం కుక్కలు దాడి చేయడంతో నీలుగాయికి గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గురువారం అటవీశాఖ అధికారులు పశువైద్యాధికారులను పిలిపించి చికిత్స చేయించి అడవిలో వదిలేశారు.

వీధికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



చేతికి గాయాలతో మహిళ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ ఎస్సీ కాలనీలో గురువారం వీధి కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కళావతి, లక్ష్మి, లస్మబాయి ఇంటి ముందు కూర్చుని ఉండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ముగ్గురికి గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

భవితకు భరోసా..!

- మౌలిక వసతులకు నిధులు
- ఉమ్మడి జిల్లాకు రూ.1.59 కోట్లు మంజూరు

మంచిర్యాలఅర్బన్: భవిత కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. దివ్యాంగ పిల్లలకు భరోసానిచ్చే భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ర్యాంపులు, రైలింగ్‌తో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న భవనాలకు మరమ్మతులు, కార్యకలాపాల గది నిర్మాణం, పిల్లలకు అనుకూలమైన అభ్యాస వాతావరణం కోసం అవసరాలకు అనుగుణంగా ఆధారిత పెయింటింగ్‌కు నిధులు మంజూరు చేస్తూ తెలంగాణ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లో భవిత కేంద్రాలుండగా ఐదు చోట్ల మాత్రమే పక్కా భవనాలున్నాయి. మిగిలిన భవిత కేంద్రాలు పాఠశాల ఆవరణలో కొనసాగుతున్నాయి. 196 మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలుండగా ఒక్కో కేంద్రానికి ఇద్దరు ఐఈఆర్‌పీల చొప్పున 36 మందికిగానూ 24 మంది విధులు నిర్వహిస్తున్నారు. 12 ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. భవిత కేంద్రాల్లో చేపట్టే పనుల అంచనాలు రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అదనపు నిధులు అవసరమైతే జస్టిఫికేషన్ నివేదికతో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశాలొచ్చాయి.

కేంద్రాల బలోపేతానికి..

భవిత కేంద్రాల్లో 196 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులున్నారు. ఇందులో 92 మంది ఇంటివద్దే ఉంటూ తగిన సేవలు అందుకుంటున్న వారున్నారు. మానసిక దివ్యాంగులు, చెవిటి, మూగ, అంధత్వం ఇలా 21 రకాలుగా పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను గుర్తించి సేవలు అందిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి భవిత కేంద్రాల బలోపేతంపై కన్వర్జెన్స్‌లో దృష్టి సారించాలని పలు సూచనలు చేశారు. నమోదును పెంచటం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరినీ గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్చటానికి ప్రత్యేక ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. రవాణా సౌకర్యం నిర్ధారించడం, పిల్లలకు వ్యక్తిగత అవసరాల ఆధారంగా అవసరమైన చికిత్స జోక్యాలు, మద్దతు అందించటానికి ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టులు క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. గతేడాది భవిత కేంద్రాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించగా, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని పొందుపర్చారు. ప్రతీ చిన్నారి విద్యాపరంగా, అభివృద్ధిలో పురోగతి సాధించటంపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. స్వయం సహాయక సంఘాల సహయంతో సీఎస్‌డబ్ల్యూయన్ గుర్తింపు వందశాతం కవరేజీకి చేరుకోవాలని ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

పక్కా భవనాలు ఎప్పుడో..?

ఉమ్మడి జిల్లాలో భవిత కేంద్రాలకు 17 చోట్ల పక్కా భవనాలున్నాయి. మిగిలిన 53 చోట్ల భవనాలులేక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులకు నిధులు కేటాయించినా పక్కా భవనాల నిర్మాణం విస్మరించారు. తాండూర్, బెల్లంపల్లి, దండేపల్లి, మందమర్రి, కోటపల్లిలో మాత్రమే భవిత కేంద్రాలున్నాయి. మిగిలిన కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. భవిత భవనాల నిర్మాణానికి స్థలగుర్తింపునకు ఎంఈవోలకు అప్పగించినట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా స్థల కేటాయింపు, నిధులు మంజూరు చేస్తేనే ప్రత్యేక అవసరాల పిల్లలకు సౌకర్యంగా మారనుంది.

నిధుల ఖర్చు ఇలా..

ఉమ్మడి జిల్లా భవిత కేంద్రాల్లో చేపట్టే పనులకు నిధులు ఖర్చు చేయడంపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు రూ.1,59,57,764 నిధులు మంజూరయ్యాయి. ప్రాధాన్యత ప్రాతిపదికన అవసరాలను గుర్తించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యకలాపాల గది నిర్మాణానికి యూనిట్‌కు రూ.7 లక్షల వరకు, ర్యాంపు, రైలింగ్‌తో కూడిన యాక్సెస్ చేయగల టాయిలెట్ నిర్మాణానికి యూనిట్‌కు రూ.లక్ష, భవనాల మరమ్మతులకు రూ.లక్ష (అవసరం ప్రకారం), ఇప్పటికే ఉన్న టాయిలెట్ల మరమ్మతులకు రూ.50వేలు, పిల్లల అభ్యాస, అవసరాలకు అనుగుణంగా పెయింటింగ్‌కు రూ. 1.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధనలున్నాయి.



మందమర్రిలో నిర్మించిన భవిత కేంద్రం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలు, పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న భవనాలు, మంజూరైన నిధులు ఇలా ఉన్నాయి.

జిల్లా	పక్కా భవనాలు	పాఠశాల ఆవరణలో	మంజూరైన నిధులు
ఆదిలాబాద్	4	14	రూ.42,24,114
కుమురంభీం	4	11	రూ.35,20,095
నిర్మల్	4	15	రూ.44,58,787
మంచిర్యాల	5	13	రూ.37,54,768
మొత్తం	17	53	రూ.1,59,57,764

వాటర్ ట్యాంకు ఎక్కి యువకుడి హల్‌చల్



ట్యాంకు పైకి ఎక్కిన జాబ్రీ జమీల్

నస్పూర్: తనకు న్యాయం చేయాలని ఓ యువకుడు గురువారం పట్టణ పరిధిలోని వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్సై ఉపేందర్‌రావు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. ఈ సందర్భంగా బాధితుడు జాబ్రీ జమీల్ మాట్లాడుతూ తనది విలేజ్ నస్పూర్ గ్రామమని, నస్పూర్ శివారు సర్వే నంబర్ 22లోని 6 ఎకరాల భూమిని మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, మరి కొందరితో కలిసి 2015 లో కొనుగోలు చేశామన్నాడు. అందులో తనకు పది శాతం వాటా ఉందన్నాడు. కొంత కాలం తర్వాత ఫిరోజ్‌ఖాన్ తన పదిశాతం వాటా కింద రూ.30 లక్షలు ఇస్తానని 2016లో అగ్రిమెంట్ చేసుకుని రూ.2.50 లక్షలు చెల్లించాడన్నారు. మిగిలిన డబ్బులు ఇవ్వకుండా భూమిని ఇతరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. రెండు రోజుల్లో న్యాయం చేయాలని, లేనిపక్షంలో కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అనంతరం యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'పొట్టేల్' సినిమాకు గద్దర్ అవార్డు



దర్శకుడు సందీప్‌రెడ్డితో సాహిత్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన పొట్టేల్ సినిమాకు గద్దర్ అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లో ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించగా పొట్టేల్ సినిమాకు 'సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్' అవార్డు దక్కింది. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినగర్‌లో నివాసం ఉండే జానకి, ధర్మగౌడ్ కుమారుడు సాహిత్ దర్శకత్వం వహించగా గత అక్టోబర్ 25న చిత్రం విడుదలై విజయం సాధించింది. సాహిత్ దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'సవారి'కి కూడా 2020లో ఐబిఎఫ్ఏ ఉత్తమ క్రిటిక్స్ అవార్డు లభించింది.

హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు కంపెనీ హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. గురువారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యజమాన్యంతో చర్చించామన్నారు. త్వరలోనే ఆస్పత్రి పనులు ప్రారంభమవుతాయన్నారు. అంతే కాకుండా భూపాలపల్లి, కొత్తగూడెం, రామగుండం సెక్టార్ 3లలో కార్మికుల పిల్లల కోసం సింగరేణి పాఠశాలలో సీబీఎస్ సిలబస్‌ను ప్రవేశపెట్టబోతున్నారన్నారు. ఈ సందర్భంగా 30 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య



సురేఖ (ఫైల్)

సాత్నాల: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన భోరజ్ మండలంలోని రాంపూర్(టి)లో గురువారం చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపిన వివరాల మేరకు జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శంకర్‌కు భోరజ్ మండలంలోని రాంపూర్(టి) గ్రామానికి చెందిన సురేఖ (35)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా శంకర్ మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి వచ్చి భార్యను వేధిస్తుండడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం రాత్రి మద్యం మత్తులో అత్తారింటికి వెళ్లి భార్యతో గొడవకు దిగడంతో కుటుంబ సభ్యులు 100కు సమాచారం అందించారు. పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు. గురువారం ఉదయం మరోసారి అత్తారింటికి వెళ్లి భార్యతో గొడవకు దిగాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేఖ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే ఇది ఆత్మహత్య కాదని, ఆమె భర్త ఉరివేసి హత్యచేశాడని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. మృతురాలి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కట్నం వేధింపుల కారణంగా మహిళ..

ఆదిలాబాద్‌టౌన్: అదనపు వరకట్న వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాలోని సింగరాయికొండకు చెందిన బండి ప్రసన్న (29)కు ఆంధ్రకు చెందిన ప్రమోద్ కుమార్‌తో 2022లో వివాహమైంది. పెళ్లయిన మూడు నెలల వరకు దంపతుల కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత అదనపు వరకట్నం కోసం ప్రమోద్ కుమార్ వేధించడం ప్రారంభించాడు. ఇటీవల ఉపాధి నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి ద్వారకానగర్‌లో భార్యతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతుండడంతో బుధవారం ఉదయం భర్త పనికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి చీరతో ఉరేసుకుని కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు గురువారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



ఆకాష్, కళ్యాణ్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందినట్లు సీఐ స్వామి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన దాడి ఆకాష్ (21), అల్లకొండ కళ్యాణ్ (23) శుభకార్యాలకు డెకరేషన్ చేస్తుంటారు. బుధవారంరాత్రి ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ అదేరోజు రాత్రి, కళ్యాణ్ గురువారం మృతి చెందారు. ఆకాష్ తండ్రి రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..

భైంసారూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ నైలు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్ (20) బుధవారం రాత్రి చాక్‌పెల్లి వెళ్లేందుకు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై నిలబడి ఉన్నాడు. ఈక్రమంలో భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కన్నెపల్లిలో ఒకరు..

దండేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన బోరె మహేశ్ (40) గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై కన్నెపల్లి నుంచి లక్సెట్టిపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలులోంచి కిందపడి వ్యక్తి..

బెల్లంపల్లి: రైలులోంచి కిందపడి ఒకరు మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. నాగపూర్‌కు చెందిన నిషాంత్ (42) బుధవారం రాత్రి హుబ్లీలో ఉన్న తన బంధువుల ఇంటికి వారణాసి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. రైలు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే నిషాంత్ రైలులో నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహానికి గురువారం పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి భార్య పూర్వీకి అప్పగించామని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన జెలిగం విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లికి చెందిన తుర్పటి గంగాధర్‌కు ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నిందితుడు రూ.7లక్షల 5వేలు తీసుకున్నాడు. నకిలీ ప్రొసిడింగ్ ఇచ్చి జాబ్ వచ్చిందని నమ్మబలికాడు. ఆ తర్వాత అతను అక్కడికి వెళ్లగా నకిలీ ప్రొసిడింగ్ అని తెలుసుకున్నాడు. మోసపోయానని గ్రహించి గురువారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సతీశ్ మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండేటి సతీశ్ (38) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు. మేస్త్రీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సతీశ్ ఇటీవల రెండు ప్లాట్లు కొనుగోలు చేసి ఇంటినిర్మాణం చేపట్టాడు. ఈక్రమంలో అప్పులు చేశాడు. అంతేకాకుండా కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. ఒకవైపు అప్పులబాధ, మరోవైపు కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే వరండాలో ఒంటరిగానే పడుకున్నాడు. తెల్లవారేసరికి రేకుల షెడ్డుకు ఉరేసుకుని కనిపించాడు. మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని అతని తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కొత్తూర్‌లో యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల రవి (36) బుధవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఖుర్షీద్‌నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న రవి ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రావి శ్రీనివాస్‌పై కేసు నమోదు



బెజ్జూర్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై సురేశ్ గురువారం తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టు చేసినట్లు తెలిపారు. రావి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బెజ్జూర్: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ కార్యకర్తలు బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి, మండల మాజీ అధ్యక్షుడు జాడి దిగంబర్, నాయకులు వసీఉల్లాఖాన్, తాళ్ల ఇందిరా, రాజారామ్, ప్రవీణ్, కిష్టయ్య, కృష్ణ, శ్యాంసుందర్, రుషి, గోపాల్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ ఎంపిక పోటీలు



జిల్లా కేంద్రంలో ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పోటీలు మూడోరోజు గురువారం హోరాహోరిగా సాగాయి. మంచిర్యాల పట్టణంలోని ఉషోదయ స్కూల్‌లో గ్రీన్, బ్లూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్లూ జట్టు 268 పరుగులు చేసి విజయం సాధించింది. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ పోలీసు బెటాలియన్‌లో నిర్వహించిన పోటీల్లో యెల్లో జట్టు 165 పరుగులు చేసి విజయం సాధించింది. మందమర్రిలోని సింగరేణి మైదానంలో జరుగుతున్న పోటీల్లో వైట్ జట్టు 229 పరుగులు చేసి విజయం సాధించిందని హెచ్‌సీఏ కోచ్ ప్రదీప్ తెలిపారు.

మొక్కజొన్నల చోరీ నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి

నర్సాపూర్(జి): ఏప్రిల్ 23న 325 క్వింటాళ్ల మొక్కజొన్నలు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాధితుడు కల్లూరుకు చెందిన బొడ్డుల శ్రీనివాస్ మే13న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం రాజీవ్ నగర్ తాండకు చెందిన బాదావత్ సంతోశ్, కంటేశ్వర్‌కు చెందిన అబ్దుల్ రజాక్ లారీ డ్రైవర్లు 325 క్వింటాళ్ల మొక్కజొన్నలను కామారెడ్డి సమీపంలో ఉన్న స్నేహా చికెన్ ఫార్మ్ గోదాంకు పీపీ ఏజెన్సీ ద్వారా విక్రయించి రూ.7,48,000 సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తామే విక్రయించినట్లు నిందితులు అంగీకరించారు. వారి వద్దనుంచి 2 లారీలు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

'గురుకుల సొసైటీ కార్యదర్శిని తొలగించాలి'



మాట్లాడుతున్న రాజనర్సు

బెల్లంపల్లి: గురుకుల విద్యాలయ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణిని ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు మరుగుదొడ్లు కడిగితే తప్పేంటని, గదులు శుభ్రం చేసుకోవడంతో పాటు కూరగాయలు తరగాలని, ఎవరి బట్టలు వారే ఉతుక్కోవాలని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎస్సీలకు చెందిన ఉన్నతాధికారిని గురుకుల సొసైటీ కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు రమేశ్, నారాయణ, రాజ్‌కుమార్, ప్రసాద్, శేఖర్, శివాజీ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య శాఖలో ఖాళీలకు ఇంటర్వ్యూలు

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఖాళీగా ఉన్న రెండు నర్సింగ్ ఆఫీసర్, 1 డీడీఎం పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నస్పూరులోని కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https:// mancherial. telangana. gov. in లో సంప్రదించాలని తెలిపారు.

తర్లపాడ్‌లో అగ్నిప్రమాదం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో గురువారం రాత్రి పల్లపు లక్ష్మి ఇంట్లో కట్టెలపొయ్యి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు.